# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో లభించే ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే వైద్య కళాశాలలపై యాజమాన్య హక్కులు పూర్తిగా ప్రభుత్వం వద్దే ఉంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.
- ❖ రబీ సీజన్‌కు అవసరమయ్యే శనగ విత్తనాలను రాయితీపై అందిస్తామని మంత్రి కె.అచ్చెన్నాయుడు రైతులకు హామీ ఇచ్చారు.
- ❖ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దోనాడి రమేశ్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈ నెల 26న ప్రసారమవుతుంది.

=====================

రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై సమీక్ష నిర్వహించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని ముఖ్యమంత్రి సూచించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి 3 వేల 320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నామని, గతంతో పోలిస్తే 34 శాతం అధికంగా వచ్చే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని చెప్పారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో ఉన్న ఖనిజాల విలువను అంచనా వేయాలని సూచించారు. విజన్ ప్లాన్ తయారు చేసి ఖనిజాలకు విలువ జోడిస్తే 20 నుంచి 30 వేల కోట్ల రూపాయల ఆదాయం పొందే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు.

=====================

రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) విధానంలో నెలకొల్పడంపై వస్తున్న విమర్శలు సహేతుకం కాదని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గుంటూరు జిల్లాలోని చినకాకానిలో ఈ రోజు జరిగిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పిపిపి విధానంలో యాజమాన్య హక్కులు పూర్తిగా ప్రభుత్వం వద్దే ఉంటాయని చెప్పారు. రెండేళ్లలో 10 వైద్య కళాశాలల నిర్మాణం పూర్తి చేస్తే వైద్య కళాశాల్లో 1,700 సీట్లు ఇక్కడి విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి అవసరమైన 8 వేల 480 కోట్ల రూపాయల మొత్తంలో గత ప్రభుత్వం 1,550 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసిందని మంత్రి తెలియజేశారు.

(వాయిస్ 24 సెకన్లు)

======================

రబీ సీజన్ కి రాయితీపై శనగ విత్తనాలు రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులకు హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా ఉన్నప్పటికీ రైతులకు అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతు అవసరాలకు సరిపడేలా విత్తనాలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

======================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ దోనాడి రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలోని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్.. జస్టిస్ రమేశ్ చేత ప్రమాణం చేయించారు. గతంలో రాష్ట్ర హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ రమేశ్.. అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఇటీవల ఆయన మరలా ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు న్యాయమూర్తిగా తిరిగి బదిలీ అయ్యారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

======================

ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని కూడా అందిస్తోందని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతపురంలోని కె.ఎస్.ఆర్. ప్రభుత్వ పాఠశాలలో ఎంపీ నిధుల ద్వారా మంజూరైన మినరల్ వాటర్ ప్లాంట్ ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక విద్యా కిట్లను అందిస్తూ.. నాణ్యమైన విద్యను అందిస్తోందని పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

======================

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) గుంటూరు క్షేత్ర కార్యాలయం రెండు రోజుల పాటు గుంటూరులోని ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో "స్వచ్ఛత హీ సేవా" కార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛోత్సవాలను నిర్వహించింది. ఈ కార్యక్రమాలలో స్థానిక సిల్వనస్ స్టాల్ గర్ల్స్ స్కూల్, లూర్డ్స్ హైస్కూల్ లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేశ్ చంద్ర మాట్లాడుతూ... ప్రతి అడుగులోనూ స్వచ్ఛతను ఆచరిస్తూ.. సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం కూడా విద్యార్థుల బాధ్యతేనని, పరిశుభ్రమైన పాఠశాలలు, శుభ్రతపరమైన అలవాట్లు విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు, శుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్న వాలంటీర్లకు ఆయన బహుమతులు అందజేశారు.

======================

జీఎస్టీ 2.0 సంస్కరణలతో క్రీడా రంగానికి కొత్త వెలుగులు వచ్చాయని.. క్రీడా సామగ్రి, ఆట బొమ్మలు మరింత చౌకగా లభ్యమవుతున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు విజయవాడలో ప్రత్యేక ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణలతో ఎంఎస్ఎంఈలు కూడా క్రీడా పరికరాల తయారీ విభాగంలో పెట్టుబడులు పెట్టే అవకాశముందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు తక్కువ ధరల్లోనే క్రీడా సామగ్రి అందుబాటులోకి రావడం వారిని మరింత ఉత్సాహంగా ముందుకు నడుపుతుందని కలెక్టర్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

======================

మారుతున్న కాలానికి అనుగుణంగా.. సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భావితరం జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన "సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈరోజు ముఖ్యమంత్రిని సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17 మంది విజేతలకు ఆయన ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... భవిష్యత్‌ను మార్చేది సంస్కరణలేనని.. సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత వాటి ఫలితాలు ప్రజలకు అందుతాయని అన్నారు. జీఎస్టీ సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం వంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం, విజేతలుగా నిలవడం అభినందనీయమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

======================

ఆంధ్రప్రదేశ్, యానాం మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర, యానాం లలో రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వెల్లడించింది.

======================

పురపాలక సంఘాలలో పి.ఎం. సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఛార్జీలు గణనీయంగా తగ్గి, స్థానిక సంస్థలు ఆర్థికంగా బలపడతాయని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు.

======================
======================